క్లుప్తంగా

యామన్‌పల్లిలో డ్రంకెన్ డ్రైవ్



మహాముత్తారం: మండలంలోని యామన్‌పల్లిలో ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీతో పాటు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేశారు. అనుమానితులను విచారించి వదిలేశారు. వాహన ధ్రువీకరణ పత్రాలు లేనివారి వివరాలు సేకరించారు. తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

ఆర్టీఐ గ్రామ కన్వీనర్‌గా గట్టయ్య



మొగుళ్లపల్లి: మండలంలోని ఆకినపల్లి గ్రామానికి చెందిన ఇలవేణి గట్టయ్యను ఆర్టీఐ గ్రామ కన్వీనర్‌గా నియమించినట్లు ఆర్టీఐ మండల కన్వీనర్ కమలాపురం విజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా గట్టయ్య మాట్లాడుతూ అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సమాచార హక్కు చట్టం ఆయుధంగా పనిచేస్తుందన్నారు. అవినీతి అధికారులను ప్రశ్నించే గొంతుకనై పని చేస్తానని గట్టయ్య అన్నారు. నా నియామకానికి సహకరించిన జిల్లా, మండల కన్వీనర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పెద్దంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని అంబట్‌పల్లి, పెద్దంపేట్ గ్రామాలకు 33 కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతులు చేస్తున్నందున సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు మల్హర్‌రావు జయంతి

మల్హర్ : మాజీ ఎంపీపీ బెల్లకొండ మల్హర్‌రావు 60 జయంతి వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాస్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కొయ్యూరు సెంటర్‌లో నిర్వహించే జయంతి కార్యక్రమానికి మాజీ జెడ్పీచైర్మన్, బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధు, భూపాలపల్లి మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్ హాజరు కానున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేగొండ ఎస్సైగా సందీప్ కుమార్



రేగొండ: స్థానిక సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా సందీప్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సందీప్‌కుమార్ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్సై రవికుమార్ వీఆర్ భూపాలపల్లికి బదిలీపై వెళ్లారు.

ముదిరాజ్ మండల కమిటీ ఎన్నిక



టేకుమట్ల: మండల కేంద్రంలో ముదిరాజ్ మండల కమిటీని ఆదివారం జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ దార్ల ఆనంద్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అనవేని రమేశ్, ఉపాధ్యక్షులుగా తిప్పనవేని నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా బొంద్ల మహేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు జోరుక సదయ్య, చింత రమేశ్, దాసరి రాజయ్య, తోట గట్టయ్య, ఈర్ల స్వామి, దానవేని రాములు, మల్లయ్య, వీరయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం కమిటీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం కమిటీని మండల అధ్యక్షుడు మేరుగు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పత్తి మల్లేష్, ఉపాధ్యక్షుడు గుజ్జుల శంకర్, ప్రధానకార్యదర్శి దుండ్రు రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగాల రామయ్య, మండల ప్రధాన కార్యదర్శి మోటం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వ్యాపారులపై పోలీసుల ఉక్కుపాదం

- నిషేధ ఉత్పత్తులపై దాడులు
- భారీగా కేసులు నమోదు

వాజేడు: గంజాయి, గుట్కా, గుడుంబా అక్రమ వ్యాపారం సాగిస్తున్న వారిపై పోలీసులు దాడులు చేస్తూ అక్రమ వ్యాపారస్తుల మత్తు వదిలిస్తున్నారు. మండలంలోని పేరూరు, వాజేడు పోలీసులు ప్రత్యేకంగా గుడుంబా, గుట్కా, గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల వ్యాపారం సాగిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతీ రోజు దాడులు చేస్తున్నారు. మండలానికి చత్తీస్‌గఢ్ రాష్ట్రం పక్కన ఉండటంతో నాటుసారాను కొందరూ అక్రమంగా తీసుకు వచ్చి సరఫరా చేస్తున్నారు. ఇలా వ్యాపారం సాగిస్తున్న వారిని గుర్తించడంతో పాటు, వారు తెచ్చిన సారా ఎవరెవరికీ విక్రయించింది తెలుసుకుని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. నాటుసారాను తరలించకుండా తనిఖీలు చేస్తూ వాహనాలను సీజ్ చేస్తున్నారు. దీంతో గుడుంబా వ్యాపారం చేసే వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గుట్కాను ఏడాది పాటు నిషేధించింది. కొందరు అక్రమ వ్యాపారస్తులు గుట్టుగా గుట్కా ప్యాకెట్లను రహస్యంగా తీసుకొచ్చి దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. పోలీసులు పలు దుకాణాలపై దాడులు నిర్వహించి గుట్కా ప్యాకెట్లను పట్టుకుని కేసులు నమోదు చేసిన సంఘటనలు ఉన్నాయి. గుట్కా వ్యాపారం సాగిస్తున్న వారిపై పోలీసులు పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసినప్పటికి గుట్కా దందా ఇంకా గుట్టుగా కొనసాగుతూనే ఉంది. దీనిని పూర్తిగా రూపుమాపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నాటుసారా ప్యాకెట్లు(ఫైల్)

వాజేడు మీదుగా సరఫరా

ఇతర ప్రాంతాలకు చెందిన వారు వాజేడు మండలం మీదుగా గంజాయి, గుడుంబా తరలిస్తున్న క్రమంలో పోలీసులు దాడులు చేసి పట్టుకోవడంతో పాటు కేసులు నమోదు చేశారు. గంజాయి సేవిస్తున్న వారిని సైతం అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసిన సందర్భాలు ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలను రూపుమాపడానికి పోలీసులు నడుం బిగించారు. అందులో భాగంగానే గంజాయి, డ్రగ్స్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గంజాయి, డ్రగ్స్ వాడడంతో జరిగే నష్టాలను యువతకు పోలీసులు వివరిస్తున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్లను అతికిస్తూ చైతన్యపరుస్తున్నారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో ఆదివారం జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడటంతో పాటు మత్తు పదార్థాల గురించి తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. 87126 70120 నంబర్‌కు సమాచారం ఇస్తే మీ సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం కృష్ణాపురం గ్రామంలో డ్రగ్స్ సమాచారం మాకు–నగదు బహుమతి మీకు పోస్టర్లను ఆవిష్కరించారు. త్వరలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



పట్టుకున్న గుట్కా ప్యాకెట్లతో పోలీసులు(ఫైల్)



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్సై కృష్ణ

వరద బాధితులకు విరాళాల సేకరణ

భూపాలపల్లి అర్బన్: వయనాడు వరద బాధితులకు అండగా సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం విరాళాల సేకరణ చేపట్టారు. సీపీఐ పట్టణ కార్యదర్శి సొక్కు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వయనాడు విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. బాధితులకు అండగా సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వర్తక వ్యాపార దుకాణాల్లో విరాళాలు సేకరించడం జరిగిందన్నారు. విరాళాలు సేకరించిన వారిలో సీపీఐ నాయకులు నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, యాకూబ్ బాషా, రవి, తిరుపతి, రాములు, లావణ్య, తదితరులు ఉన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

ప్రజలతో మమేకమైనప్పుడే గుర్తింపు

- పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్

శాయంపేట : ప్రజలతో ఉద్యోగులు మమేకమై పనిచేసినప్పుడే ప్రజలు చిరస్థాయిలో గుర్తుంచుకుంటారని పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన గొట్టిముక్కల రమేశ్ సన్మాన సభ ఆదివారం ఎస్సై ప్రమోద్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా ఏసీపీ హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరికి ఉద్యోగ విరమణ తప్పదన్నారు. హోంగార్డుగా రమేశ్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం రమేశ్ దంపతులను పూలమాల, శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఇటీవల బదిలీపై వెళ్లిన ఏఎస్సై శైలజ, హెడ్ కానిస్టేబుల్ స్వామినాయక్‌ను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాయంపేట, పరకాల సీఐలు రంజిత్‌రావు, క్రాంతికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డు రమేశ్ దంపతులను సన్మానిస్తున్న ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐలు, ఎస్సై

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

కమలాపూర్ : మండలంలోని కానిపర్తి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో ఏడో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు 23 సంవత్సరాల తరువాత ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సన్మానించారు. పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ అసాన్‌అలీ, ప్రకాశం రాజమౌళి, స్వర్ణలత, రమేశ్, దాసరి రమేశ్, పూర్వ విద్యార్థులు మమత, శ్రీలత, స్రవంతి, రాధిక, సృజన, సుమలత, రమాదేవి, కల్యాణి, ప్రతాప్, చిరంజీవి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.



పరకాల సీఎస్ఐ పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

పరకాలలో..

హన్మకొండ (పరకాల) : పరకాల పట్టణంలోని సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాలలో 1992–1993 సంవత్సరంలో చదువుకున్న పదోతరగతి విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 31 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకోవడంతో సంబురపడ్డారు. అనంతరం తమకు పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కే.జే థామస్, ఉపాధ్యాయులు డి.కోర్నెల్, ఎం.నరసింహరామయ్య, జేమ్స్, ఉపాధ్యాయేతర సిబ్బంది జాన్, పాల్, ఐలన్న, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

ఖిలా వరంగల్: స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి నాగరాజు డిమాండ్ చేశారు. వరంగల్ ఉర్సుగుట్టలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. కాస్మోటిక్ చార్జీలు పేరుకే తప్ప విద్యార్థులకు ఏమాత్రం సరిపోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం గురుకులాలపై కపట ప్రేమ చూపుతోందని ధ్వజమెత్తారు. మెనూ పాటించడం లేదని, పౌష్టికాహారం అందించడం లేదని వాపోయారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీకాంత్‌వర్మ, సంతోష్, శంకర్, మమత, ప్రశాంత్, గజ్జెల శ్రీకాంత్, పూజ, దామెర్, కిరణ్, చుక్క ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎల్.మూర్తి

మహాప్రదర్శనను విజయవంతం చేయాలి

కమలాపూర్ : ఎస్సీ వర్గీకరణ సాధకుడు మంద కృష్ణమాదిగ ఢిల్లీ పర్యటన ముగించుకుని ఈనెల 13వ తేదీన హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలకడంతో పాటు నిర్వహించే విజయోత్సవ మహాప్రదర్శన ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ప్రధానకార్యదర్శి, మండల ఇన్‌చార్జ్ అంకిల్ల మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మహాప్రదర్శనను ప్రతీ ఇంటి నుంచి మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న అంకిల్ల మాదిగ

మార్కెట్ చైర్‌పర్సన్‌కు ఘన సన్మానం



చిట్యాల: మండల వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి–సత్యంలను మండల ఫర్టిలైజర్ షాప్ యజమానులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు కలిసి శాలువాలతో ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ షాపు యజమానులు పువ్వాటి హరికృష్ణ, బుర్ర సదయ్య, బుర్ర రాజు, తిరుపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బావి వద్ద ప్రత్యేక ప్రార్థనలు



రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట గ్రామ శివారులోని చేదబావిలో గత రెండు రోజుల నుంచి పీర్ల దేవుడు కనిపించాడంటూ ఆచారమంతురాలు తెలపడంతో గ్రామస్తులు ఆసక్తితో తిలకించారు. ఆదివారం కావడంతో కొందరు కుటుంబ సభ్యులతో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మొగుళ్లపల్లికి '108' వాహనం కేటాయించాలి

మొగుళ్లపల్లి: మండలానికి 108 వాహనం ప్రభుత్వం కేటాయించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి కోరారు. మండలంలో 25 గ్రామాల్లో ప్రజలు ఆపద సమయంలో, రోడ్డు ప్రమాదాలు అనారోగ్య బారిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిట్యాల మండల కేంద్రంలో నుంచి 108 వాహనం వచ్చేసరికి సమయం సరిపోక అత్యవసర పరిస్థితిలో బాధితులు ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వాహనాల్లో చిట్యాల సామాజిక వైద్యశాలకు చికిత్స కోసం వెళ్తున్నారన్నారు. సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి పాత మండలమైన మొగుళ్లపల్లికి నూతన 108 వాహనం కేటాయించాలని కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్ గ్రామంలో కొంత మంది పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం దామెర పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న భాయి కుమారస్వామి, శివకుమార్, చిన్న రాజయ్య, గండి సమ్మయ్య, భాయి అన్విత్‌రాజ్ నుంచి రూ.1,150 నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని దామెర పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు.

ముళ్లపొదల తొలగింపు

నడికూడ : మండలంలోని నార్లాపూర్ గ్రామంలో గల కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ నాయకులు గ్రామంలోని చెరువుకట్ట నుంచి ఎస్సారెస్పీ కెనాల్ వరకు ఉన్న ముళ్లపొదలను జేసీబీతో తొలగించారు. అనంతరం గుంతలను పూడ్చివేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్న, ఒరుగంటి రాజయ్య, శనిగరపు రవీందర్, రాజు, కుమారస్వామి పాల్గొన్నారు.



ముళ్లపొదలను తొలగిస్తున్న జేసీబీ యంత్రం

ఘనంగా పోచమ్మ బోనాలు

- మొక్కులు చెల్లించిన మంత్రి సీతక్క

గోవిందరావుపేట : మండల కేంద్రంతో పాటు చల్వాయి గ్రామాల్లో ఆదివారం పోచమ్మబోనాలు నిర్వహించారు. గోవిందరావుపేటలోని పోచమ్మ దేవాలయంలో పోచమ్మతల్లికి మంత్రి సీతక్క పసుపు, కుంకుమ, చీర సమర్పించి ఆదివారం మొక్కులు సమర్పించుకున్నారు. ఇళ్ల నుంచి బోనాన్ని నెత్తిన ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు ఆలయానికి బయల్దేరారు. అనంతరం అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు పోచమ్మతల్లికి సమర్పించారు. వర్షాలు బాగా కురిపించి ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని, ఊరంతా చల్లగా చూడాలని, పాడి పంటలు బాగుండాలని, కోళ్లు, గొర్రెలను అమ్మవారికి బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాల వద్దకు తరలివచ్చారు. గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



పోచమ్మతల్లికి పసుపు, కుంకుమ, చీర తీసుకెళ్తున్న మంత్రి సీతక్క

బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్ గౌడ్

మొగుళ్లపల్లి: దేశంలో సమగ్ర కులగణన చేపట్టి, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని, రిజర్వేషన్లను పెంచకుండా బీసీలను విస్మరిస్తే తగిన బుద్ధి చెప్తామని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేపట్టే జనగణనలో కులగణన చేపట్టాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని, సామాజిక రిజర్వేషన్ల పరిమితిని పెంచాలన్నారు. బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా ఓబీసీలను విస్మరించినందుకే 400 సీట్లతో సంపూర్ణ మెజార్టీతో అధికారంలోకి వస్తామని చెప్పిన బీజేపీ 240తో సరిపెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. బీసీల కనీస డిమాండ్లు నెరవేర్చనందుకు, బీసీలపై అడుగడుగునా వివక్షత, అణచివేత ధోరణి చూపినందుకే సంపూర్ణ మెజార్టీతో ఉండాల్సిన బీజేపీ ప్రభుత్వం ఈరోజు సంకీర్ణంలోకి పడిపోయిందన్నారు. కులగణన ఎజెండాతో ఎన్నికల్లోకి వెళ్లిన ఇండియా కూటమికి సర్వేలకు విరుద్ధంగా అనూహ్య మద్దతు వచ్చిందంటే కులగణన చేస్తామని చెప్పినందుకే దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీలు ఇండియా కూటమికి అండగా నిలిచారన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ బీసీలపై దృష్టి సారించాలని, ఎస్సీ వర్గీకరణ లాగే బీసీలకు కులగణన, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని కోరారు. కులగణనను చేపట్టి 42 శాతం రిజర్వేషన్లను ప్రవేశపెట్టిన తర్వాతనే స్థానిక ఎన్నికలను నిర్వహించాలని ఆయన కోరారు.

గ్రామాల్లో ఘనంగా తిరంగా యాత్ర

చిట్యాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని చల్లగరిగ తదితర గ్రామాల్లో కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా యాత్రను బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణ త్యాగాల ద్వారా వచ్చిన స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రతీ ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెక్క నర్సయ్య, మైదం శ్రీకాంత్, గుండ సురేష్, మండల మొగిలి, సదానందం, రాయిని శ్రీకాంత్, వల్లాల ప్రవీణ్, సంపత్, పిట్టల నాగరాజు, రాజు, ప్రభాకర్, ప్రశాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుర్ర వెంకటేశ్ గౌడ్

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

కాటారం: టీజీఎస్ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన కట్కు శ్రీనివాస్ కుటుంబానికి పదో తరగతి స్నేహితులు అండగా నిలిచి చేయూతనిచ్చారు. ఏపీఆర్ఎస్‌జేసీ దౌలతాబాద్ 1991వ సంవత్సరం పదోతరగతి బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్ స్నేహితులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రూ.1.80 లక్షలు ఆర్థికసాయంగా కుటుంబ సభ్యులకు అందజేశారు. పరామర్శించిన వారిలో స్నేహితులు లక్ష్మణ్, లింగన్న, రఘు, గంగారం, ఆనంద్, రమాకాంత్, ఎన్ఆర్ఐ మిత్రులు ఉన్నారు.

అక్రమాలపై నిలదీసినందుకే ఆరోపణలు

- డీవైఎఫ్ఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురేశ్

శాయంపేట : డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి అక్రమ దందాకు పాల్పడుతున్నాడని బహుజన స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద సురేశ్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తిరుపతి చేసే అక్రమాలపై నిలదీసినందుకు తనపై కక్షతో ఆరోపణలు చేస్తున్నట్లు మండిపడ్డారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదల దగ్గర నుంచి డబ్బులు దండుకున్నాడని ఆరోపించారు. 10 సంవత్సరాల నుంచి పార్టీకి సేవలు చేసిన తనపై గుండ్ల సింగారం పరిధిలో ఒక ప్లాట్ కావాలని తిరుపతిని అడుగగా కొంత డబ్బు ఇస్తేనే జిల్లా కమిటీతో మాట్లాడి ఇప్పియ్యగలుగుతానని చెప్పాడని ఆరోపించారు. ఇలాంటి అక్రమాలను నిలదీసి అడగడం వలనే తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఫండ్ కలెక్షన్ చేయమని చెప్పకముందే తన సొంత నిర్ణయాలతో అక్రమాలకు పాల్పడి డబ్బుల వాసుళ్లకు పాల్పడుతున్నాడని అన్నారు. డీవైఎఫ్ఐ ఆర్గనైజన్ పేరుతో రూ. 50లక్షలు కలెక్షన్ చేసుకొని రాష్ట్ర కమిటీ దృష్టికి తెలియకుండా గుండ్ల సింగారంలో ప్లాట్ కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నాడని ఆరోపించారు. ఆయన వెంట రాజశేఖర్, సురేశ్, ప్రమోద్, నవీన్ ఉన్నారు.



మాట్లాడుతున్న మంద సురేశ్

కేయూలో నేడు గ్రంథాలయ దినోత్సవం

కేయూ క్యాంపస్: గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్ 132వ జయంతి సందర్భంగా సోమవారం మధ్యాహ్నం కేయూలోని కేంద్ర గ్రంథాలయంలో లైబ్రేరియన్స్ డేను నిర్వహించనున్నట్లు కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమాచార్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గ్రంథాలయ సంస్థ వరంగల్ శాఖ, కేయూ కేంద్ర గ్రంథాలయం లైబ్రరీ సైన్స్ డిపార్టుమెంట్ సంయుక్తంగా నిర్వహించనున్న కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నేడు రైల్వే డీజిల్‌షెడ్ ఎదుట ధర్నా

కాజీపేట రూరల్: రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్ ఎదుట రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు బ్రాంచ్ ప్రెసిడెంట్ జానీమియా, సెక్రటరీ పి.వేదప్రకాష్ తెలిపారు. రైల్వే కార్మికులకు పాత పింఛన్ అమలు చేయాలని, 18 నెలల పెండింగ్ డీఏ ఎరియర్స్ చెల్లించాలని, 8వ పే కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని, డీజిల్ షెడ్‌లో ఖాళీలను భర్తీ చేయాలని నిరసన తెలపనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.